క్లుప్తంగా

కరకట్టపై ట్రాఫిక్ జామ్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి, అమరావతి కరకట్టపై శనివారం ట్రాఫిక్ నిలిచిపోయింది. సంఘటనా స్థలానికి వెళ్లిన తాడేపల్లి పోలీసులు గంటపాటు శ్రమించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కరకట్ట వెంబడి వున్న ఇస్కాన్ దేవస్థానంలో శనివారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడంతో విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వివిధ వాహనాల ద్వారా తరలివచ్చారు. ఇస్కాన్ టెంపుల్ వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో కరకట్ట వెంబడి వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎస్ఐ స్వామి సంఘటనా స్థలానికి వెళ్లి రోడ్డుపై అడ్డంగా పెట్టిన వాహనాలను తీయించడంతో గంట తరువాత యధావిధిగా రాకపోకలు సాగాయి.

కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి



దుగ్గిరాల: పేద కాపు మహిళల వివాహానికి పెళ్లి కానుక పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలని ప్రజా కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఈమని గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దుగ్గిరాల మండల కాపు నాడు అధ్యక్షుడిగా ఎన్నికైన వెలివెల కృష్ణారావుకు నియాక పత్రం అందించి మాట్లాడారు. ఈమని గ్రామంలో కాపు కళ్యాణ మండపం ప్రభుత్వం నిర్మాణం చేయాలని, కాపులంతా ఐక్యంగా ఉండాలని కోరారు. ఆళ్ళ మల్ల సుబ్రహ్మణ్యం, కరుణశ్రీ, జ్యోతి రామి రెడ్డి, ఆదిత్య, కిరణ్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



దుగ్గిరాల: అధిక వర్షాల వల్ల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఎకరాకు రైతుకు రూ.15 వేలు ప్రభుత్వం అందించాలని కౌలు రైతు సంఘం జిల్లాకార్యదర్శి కె.అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం బృందం శనివారం దుగ్గిరాల మండలంలోని పెనుమూలి, మంచికలపూడి, పెదకొండూరు, గ్రామాలలో పర్యటించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వరి వెద పద్ధతిలో వేయటం వల్ల అకాల వర్షాలకు సుమారు లక్ష ఎకారాల్లో నష్టం వాటిల్లిందన్నారు. మురుగు నీటి కాలువల్లో ఉన్న తూటి కాడ, గుర్రపు డెక్క సరిగా తొలగించకపోవడం ద్వారా మురుగునీటి పారుదలకు జరగక పంట నీట మునిగిందని తెలిపారు. ప్రభుత్వం హడావుడిగా కాకుండా, శాశ్వతంగా పరిష్కరించే విధంగా కాలువలను మొరుగు పరచాలని, రైతు మరల పంట వేయడానికి ఎకరాకు రూ.15 వేలు తగ్గకుండా సహాయం చేసి వారిని ఆదుకోవాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 18న మండల కేంద్రాల్లో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మన్నవ నాగమల్లేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వర రావు, ఎం.శివ సాంబిరెడ్డి, ఎం.భవన్నారాయణ, అమ్మిరెడ్డి, అంజిరెడ్డి, బి.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

డీఎల్‌పీఓ కె.శ్రీనివాసులు



ఫిరంగిపురం: సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని డీఎల్‌పీఓ కె.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మేరికపూడి, మునగపాడు, పొనుగుపాడు, బేతపూడి, నుదురుపాడు, ఫిరంగిపురం గ్రామాల్లో గత నాలుగురోజులుగా సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న స్వామిత్వ సేవలను శనివారం డీఎల్‌పీఓ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆ ఇంటి కొలుతలు పూర్తిగా యాప్‌లో అప్‌లోడు చేస్తారని చెప్పారు. తరువాత వారికి ఒకకార్డును అందజేస్తారన్నారు. దానిద్వారా ఆ ఇంటి యజమాని బ్యాంకు లోను తీసుకునేందుకు అయినా, మరొకరికి ట్రాన్స్‌ఫర్ చేసేందుకు అయినా లేదా అవసరం నిమిత్తం అమ్ముకునేందుకు ఆ కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. దాని ద్వారా వారికి తమ ఆస్తి వివరాలు తెలియజేసే ఆస్తివివరాలు తెలిపే గుర్తింపుకార్డు ప్రభుత్వం ద్వారా అందజేస్తారన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఏఓ ఏకే బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు
- ఉట్టికొట్టే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న యువత

తాడేపల్లిరూరల్: ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి వున్న శ్రీశ్రీ రాధా శ్యామసుందరుల వారి మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మందిర అధ్యక్షుడు చక్రధరి దాసు మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన సందర్భంగా ఉదయం 4.30 గంటలకు శ్రీశ్రీ రాధా శ్యామసుందరల వారికి మంగళహారతి, పూజా కార్యక్రమాలు, 7.30 గంటలకు దర్శన హారతి, అనంతరం జులన్ యాత్ర (ఉయ్యాల సేవ), హరినామ జపం, సంకీర్తన యజ్ఞం, గో సేవ, తులసి పరిక్రమ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం కలశాభిషేకం, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి మహాశన్యాభిషేకం, 17వ తేదీ ఉదయం నందోత్సవం, శ్రీల ప్రభుదాసుల వారి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాలను స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమలో వేణు ధరికృష్ణ దాస్, బలరాం గోవిందదాస్, వజ్రధామ్ దాస్, శ్యామ సుందర అచ్యుత దాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

తాడేపల్లిరూరల్: కృష్ణాష్టమి సందర్భంగా తాడేపల్లి పట్టణ, మండల పరిధిలో కృష్ణ మందిరాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తాడేపల్లి మహానాడులో వున్న శ్రీకృష్ణ దేవాలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద వున్న శ్రీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. దొంతిరెడ్డి



రాధా శ్యామసుందరుల మందిరంలో ప్రత్యేక అలకంరణలో రాధాశ్యామ సుందరుల విగ్రహాలు

వేమారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహానాడులో జరిగిన కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు కేతిబోయిన హనుమయ్య, మోడీరాజు, ఏడుకొండలు, రాజమోహన్, అశోక్, శ్రీను, శ్రీదేవి, భక్తులు పాల్గొన్నారు. నెహ్రూబొమ్మ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు మేకా వెంకటరామిరెడ్డి, సూర్యనారాయణ బాబు, టి.నాగేశ్వరరావు, సోమయ్య, బాజీ, తమ్మ గీతాంజలి, తాడిబోయిన మంగదేవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

తాడేపల్లి నెహ్రూ బొమ్మ సెంటర్‌లో వున్న శ్రీకృష్ణ మందిరంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంటరావు, సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



టిడ్కో గృహ సముదాయం ఆవరణలో ఉట్టికొడుతున్న యువకులు, చిన్నారులు



తాడేపల్లిలో నెహ్రూబొమ్మ సెంటర్‌లోని కృష్ణమందిరంలో పూజలు చేస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి



నెహ్రూబొమ్మ కృష్ణమందిరం వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొన్న బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి

దుగ్గిరాలలో...

దుగ్గిరాల: దుగ్గిరాలలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు శనివారం శివాలయం సెంటర్‌లో శ్రీకృష్ణ సేవా సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైలుపేట, యాదవ బజారు నందు ఉన్న శ్రీకృష్ణుని మందిరం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శించుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.

మంగళగిరిలో..

మంగళగిరి టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం మంగళగిరి నగర పరిధిలో దేవాలయాలు, నివాసాల్లో వేడుకలను ప్రజలు ఘనంగా జరిపారు. నివాసాలు ఉదయం నుంచే బాలకృష్ణుని పూజలతో కళకళలాడాయి. అర్చనలు, అభిషేకాలు, ఉత్తరాలంకరణ, వివిధ రకాల పుష్పాలు, తులసి మాలలతో అందంగా అలంకరించారు. నగర పరిధిలోని ఇస్కాన్ దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిపారు. నగరపరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో యువతీ యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ద్వారకానగర్, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం దగ్గర, కొప్పురావు కాలనీ, సీతారామ కోవెల సెంటర్‌లతో పాటు పలుప్రాంతాల్లో ఆదివారం ఉట్టికొట్టే కార్యక్రమాలను నిర్వహించారు.



దుగ్గిరాల శివాలయం సెంటర్‌లో శ్రీకృష్ణ సేవా సమాజం ఆధ్వర్యంలో వేడుకలు

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. నుదురుపాడు, అల్లంవారిపాలెం, హౌసిగణేష్, 113 త్యాళ్లూరు, శిరంగిపాలెం గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. 113 త్యాళ్లూరులో యాదవ బజారులోని శ్రీకృష్ణ మందిరం వద్ద ఉదయాన్నే భక్తులు విశేషపూజలు చేశారు. పొంగళ్లు పొంగించి కొబ్బరికాయలు కొట్టారు. సాయంత్రం యాదవ యూత్ ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీ కృష్ణ ఉత్సవ విగ్రహం బహూకరణ

దుగ్గిరాల: శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహం బహూకరణ శనివారం యాదవ బాజారులో ఉన్న శ్రీకృష్ణ మందిరానికి కాకా మహేష్ – మాధవి దంపతులు భక్తిశ్రద్ధలతో ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించి ఆలయానికి విగ్రహాన్ని బహూకరించారు. బొజ్జా లక్ష్మీ నారాయణ, బొజ్జా నాగేశ్వర రావు, కోనంకి కృష్ణ, సి.శ్రీను, నాని, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు
- అధికారంలోకి వచ్చాక తూట్లు
- చంద్రబాబు మోసాన్ని ఇంటింటికి వివరించండి
- వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు
- సిరిపురంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కంకణాల పరమేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) హాజరయ్యారు. ఈ సందర్భంగా వజ్రబాబు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.లక్ష దాకా నష్టపోయిందన్నారు.

■ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒత్తిడితోనే ఈ ఏడాది తూతూ మంత్రంగా తల్లికి వందనం అమలు చేశారన్నారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు రాష్ట్రంలో కోటి మంది ఉన్నారని, వారికి ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని కూటమి సర్కారు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఎన్నికల ముందు మాట ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు దానిపై అతీగతి లేదన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా, నిరుద్యోగ భృతి సైతం ఇవ్వకుండా యువతను దగా చేశారని మండిపడ్డారు. బాబు దగ్గాపై నిరుద్యోగులు యువకులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఇళ్ల స్థలాల కోసం పేదలు, పింఛన్ల కోసం వితంతులు, దివ్యాంగులు, వృద్ధులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. పథకాలు అమలు ఎప్పుడని ప్రశ్నిస్తే దాడులు చేస్తూ కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరు వంశీకష్ణ, గ్రామ వైస్ సర్పంచ్ వినుకొల్లు సాంబశివరావు, కాసు విజయమ్మ, మిరియాల శివరామకృష్ణ, అబ్బాస్, అబ్దుల్లా, మైనార్టీ నాయకులు షేక్ షరీఫ్, మంగళగిరిపాడు సర్పంచ్ షేక్ రబ్బాని, గుంటుపల్లి ప్రదీప్, శ్రీను, గొంది రవి, అబ్దుల్లా, కన్నయ్య, వెంకట్రావు ఎస్‌కే నజీర్, హబీబుల్లా, సూర్యనారాయణ రెడ్డి, ఆరుద్ర కోటేశ్వరరావు, నెలపాటి శంకర్. తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మంగళగిరి: ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు తెలిపారు. శనివారం మంగళగిరి మార్కెట్ యార్డును సందర్శించారు. అక్కడ ఉన్న గౌడోన్‌లోని ఎరువులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు సీజన్‌లో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మార్పీకంటే అధిక ధరలకు విక్రయించినా, యూరియాను బ్లాక్ చేసి రైతులను ఇబ్బంది పెడితే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ రామారావు, డీసీఎంఎస్ బీఎం హరిగోపాల్, మేనేజర్ శ్రీనివాసరావు ఉన్నారు.

ఉత్తమ సేవాపతక గ్రహీతలకు అభినందనలు

ఫిరంగిపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉత్తమ పురస్కారాలు పొందిన సిబ్బందిని శనివారం పలువురు అభినందించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పి.జాన్‌ఖాన్ ఉత్తమసేవాపతకం అందుకోవడంతో సీఐ శివరామకృష్ణ, ఎస్ఐ సురేష్, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఆదేవిధంగా ఉత్తమ పశువైద్యాధికారిగా అవార్డు అందుకున్న నుదురుపాడు పశువైద్యాధికారి పీర్‌అహ్మద్‌కు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, సిబ్బంది అభినందనలు తెలిపారు. బేతపూడి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న వి.జాన్‌బీ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా సీడీపీఓ అనూరాధ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు అభినందనలు తెలిపారు.

గౌతు లచ్చన్నకు ఘననివాళి

మంగళగిరి టౌన్: సర్దార్ గౌతు లచ్చన్న మార్గం అనుసరణీయమని బీసీ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ కొనియాడారు. మంగళగిరి నగరపరిధిలోని రాష్ట్ర బీసీ సంఘం కార్యాలయంలో శనివారం గౌతు లచ్చన్న జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు బీసీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులుగా, బలహీన వర్గాలు, రైతు, కార్మిక నాయకుడిగా అనేక ఉద్యమాలు సాగించారన్నారు. నమ్మిన సిద్ధాంతాలకై పోరాడి నిలిచిన మహా నాయకుడు లచ్చన్న అని పేర్కొన్నారు. బీసీ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పారేపల్లి మహేష్

హామీలు అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణలతో కలసి సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయినా, ఇంతవరకు హామీ నెరవేర్చలేదన్నారు. కార్మికులు రమాదేవి, శారమ్మ, దుర్గాభవాని, నాగమల్లేశ్వరి, ఇమాంబీ, నరసింహారావు, సుబ్బారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న వేముల దుర్గారావు, కూరపాటి స్టీవెన్

ఆస్తులకు ఆటో మ్యూటేషన్!

- మార్కెట్ విలువ ఆధారంగా మ్యూటేషన్ ఫీజు
- పన్ను బకాయిలు ఉంటే స్లాట్ బుక్ అవదు
- ఈనెల నుంచి ఎంటీఎంసీలో అమలు చేస్తున్న అధికారులు

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆదాయ మార్గాల కోసం కొత్తదారులు ఎంచుకుంటోంది. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి వాటి అమలుకు నిధుల వేట కొనసాగిస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖలో ఈనెల నుంచి ఆస్తులకు ఆటోమ్యూటేషన్ పేరిట కొత్త విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. ఎవరైనా ఇంటి, నీటిపన్ను బకాయిలు ఉంటే ఆస్తుల రిజిస్ట్రేషన్ జరగవు. గతంలో ఈ పన్నుల బకాయిలు వున్నా రిజిస్ట్రేషన్లు చేసేవారు. ఆ తరువాత వినియోగదారుడు మున్సిపల్ కార్యాలయంలో మ్యూటేషన్ చేసుకునేవారు. అయితే ఈ ప్రక్రియలో పన్ను బకాయిలు ఉన్నా రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధం లేదు. రిజిస్ట్రేషన్లు చేసేసేవారు. మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేసేవారు సచివాలయం నుంచి గానీ, నగరపాలక సంస్థ కార్యాలయానికి గాని దరఖాస్తు చేసుకుంటే పరిశీలన అయ్యాక టైటిల్ మార్పు చేసి పన్ను విధించేవారు. ఈ విధానంలో మార్పును తీసుకువస్తూ ఆటో మ్యూటేషన్ పేరిట కూటమి ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది.

■ గతంలో వ్యవసాయ పొలాలకు మాత్రమే ఆటో మ్యూటేషన్ విధానం అమలులో ఉండేది. వాటిని ఇల్లు, వాణిజ్య సముదాయాలకు ఈనెల 1వ తేదీ నుంచి అమలు చేశారు. ఈ విధానాన్ని మొదట ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడలో మొదట అమలు చేశారు. ఈనెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్ల పరిధిలో అమలులోకి తీసుకువచ్చారు. గతంలో నగరంలో ఏదైనా స్థలం లేదా ఇంటిని తీసుకుంటే కొనుగోలు దారులు ఆస్తిని తమపేరిట మార్చుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో వీటికోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పుడు అలా కాకుండా ఆస్తి వున్నా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఆటో మ్యూటేషన్ చేయనున్నారు. అయితే ఇప్పుడు రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయంలో పన్నుల బకాయిలు లేకుండా అప్‌డేట్ అయి ఉండాలి. సంబంధిత వివరాలు అప్‌లోడ్ చేశాకే స్లాట్ బుక్ అవుతుంది. పన్నుల బకాయిలు ఉంటే స్లాట్ బుక్ అవ్వదు.



మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



ఆటో మ్యూటేషన్ విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా, సబ్ రిజిస్ట్రార్ (ఫైల్)

పన్ను రశీదు తప్పని సరి...

రిజిస్ట్రేషన్ సమయంలో ఇంటికి చెల్లిస్తున్న ఆస్తి, నీటిపన్ను రశీదులను తప్పకుండా సమర్పించాలి. స్థలం అయితే వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) అందజేయాలి. రిజిస్ట్రేషన్ తరువాత ఆటోమెటిక్‌గా నగరపాలక సంస్థ రికార్డుల్లో పేరు మారిపోతుంది. అవిలేని పక్షంలో పన్నువేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నగరపాలక సంస్థ లాగిన్‌కు సమాచారం వస్తుంది. ఆ మేరకు పేరు మార్చి పన్ను విధిస్తారు. ఒకే ఆస్తిని ఇద్దరు, ముగ్గురు కలిసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తించనుంది.

వినియోగదారులకు ఉపయుక్తం

ఆటో మ్యూటేషన విధానాన్ని ఈ నెల నుంచి ప్రవేశపెట్టారు. రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయంలో నగర పరిధిలోని ఆస్తుల అసెస్‌మెంట్ నెంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ సమయంలో ఎలాంటి బకాయిలు ఉండకూడదు. ఈ విధానంతో వేగంగా మ్యూటేషన్ జరుగుతోంది. ఇది వినియోగదారులకు ఎంతో ఉపయోగకరం.

– బాల గురవయ్య, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్

విగ్రహ ఊరేగింపును అడ్డుకున్న పోలీసులు

నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్న వైనం

దుగ్గిరాల: శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపు నేపథ్యంలో వివాదం చెలరేగి, ఘర్షణలకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. శనివారం రాత్రి దుగ్గిరాల మండలం పేరకలపూడిలో స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో యువకులు శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉత్సవాలు నిర్వహించి, అనంతరం గ్రామంలో ఊరేగింపు తలపెట్టారు. ఈక్రమంలో దుగ్గిరాల పోలీసులు ఆ ప్రాంతానికి వచ్చి ఊరేగింపునకు అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. అదేమని అడిగిన ట్రాక్టర్ డ్రైవర్ సెల్‌ఫోన్‌ను లాక్కొని, ఈక్రమంలో ఘర్షణ జరగ్గా, పలువురికి గాయాలయ్యాయి. నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అంధకారంలో తాడికొండ ప్రధాన రహదారి

తాడికొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ సరఫరాలో లోపం ఏర్పడి తాడికొండ ప్రధాన రహదారి అంధకారమయంగా మారింది. వీధిలైట్లకు సరఫరాలో లోపం ఏర్పడటంతో లైట్లు ఆరిపోయాయి. అయితే సకాలంలో పట్టించుకుని పునరుద్ధరించాల్సిన పంచాయతీ సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో ప్రధాన రహదారి అంధకారమైంది. అసలే వ్యాపార సముదాయం, ఆపై దొంగల భయం నేపథ్యంలో పంచాయతీ అధికారులు సత్వరం స్పందించి, వీధిలైట్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తాడికొండలో అంధకారంగా ఉన్న ప్రధాన రహదారి

■ **'స్వచ్ఛత సేవ'లో ఉద్యోగులంతా పాల్గొనాలి**

తెనాలి అర్బన్: స్వచ్ఛత సేవా కార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొనాలని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ తెలిపాపరు. కార్యక్రమంలో భాగంగా శనివారం డిపో ఆవరణలో ని పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలలో మూడో శనివారం స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.